క్లుప్తంగా

రామలింగేశ్వరుని సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామి ఉపాలయం వద్ద మంగళవారం మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఏకాదశి మంగళవారం కావడంతో ఆలయంలో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భూ-సర్వే పక్కాగా నిర్వహించాలి



భూ సర్వేపై మాట్లాడుతున్న ఆర్డీఓ దాసిరాజు

పెనుగొండ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ సర్వే పక్కాగా నిర్వహించాలని నరసాపురం ఆర్డీఓ దాసిరాజు అన్నారు. మంగళవారం ఆచంట తహసీల్దారు కార్యాలయంలో భూసర్వేపై సర్వేయరు సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దారు జి.కనకరాజు ఉన్నారు.

గొల్లవానితిప్ప పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న జి. గీతాబాయి

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్పలో కొప్పర్తి వీరాస్వామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి. గీతాబాయి తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ, ఓపీ, డెలివరీరూమ్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించి పలు అంశాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను పలకరించి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాశాఖాధికారి జి. గీతాబాయి మాట్లాడుతూ రోగులకు పట్ల చిత్తశుద్ధితో ఉండాలని నాణ్యమైన వైద్యాన్ని అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. హసితా, డాక్టర్ కె. అరుణరాణి, ఎంపీహెచ్‌ఈవో కె. అప్పారావు, ఎంపీమెచ్‌ఎస్ జి. శ్రీనివాసరావు, ఎమ్ విజయకుమారి, తదితరులు ఉన్నారు.

పాస్టర్ మరణంపై విచారణ చేయాలి

ఆకివీడు: రాజమండ్రిలోని కొంతమూరు-దివాన్‌చెరువు మధ్యలో మరణించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై పూర్తి విచారణ చేపట్టాలని ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌కు మంగళవారం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. పాస్టర్ మరణంపై అనుమానాలు వ్యక్తం అవుతున్న సందర్భంగా న్యాయమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెలోషిప్ మండల అధ్యక్షుడు కె.దీవెనరాజు,ఉపాధ్యక్షులు ప్రభుకుమార్, జాన్‌ప్రకాష్, ఏలియా, డాక్టర్ రత్నకుమార్ పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం: మహిళల రక్షణ కోసం శక్తి పేరిట రూపొందించిన యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీసా చెప్పారు. మంగళవారం పట్టణంలోని మెంటేవారితోటలో అమ్మ సేవా బృందం మహిళలకు అహ్మదున్నీసా శక్తి యాప్‌పై అవగాహన కల్పించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు వివిధ సందర్భాల్లో ప్రయాణాల్లో తోటిమనిషి సాయం లేకుండా మన వద్దనున్న మొబైల్ ఫోన్‌లోని శక్తి యాప్‌ను ఆయుధంగా ఉపయోగించుకోవచ్చునన్నారు. అనంతరం మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించి వారి మొబైల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ లక్ష్మి, అల్లు శ్రీనివాస్, అమ్మ సేవా బృందం అధ్యక్షురాలు జవ్వాది పద్మశ్రీ, కోమటి వెంకటేశ్వరి, కె శ్రీదేవి, తవ్వ స్వాతి, కోయ సరోజిని, గంటా వేణు, కోయ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారమెప్పుడు?

- చెత్త సమస్య పరిష్కారం దిశగా నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు
- ఆ ఏజెన్సీని క్యాన్సిల్ చేయడంతో సమస్య మొదటికి



రామయ్య హాలు ప్రాంతంలో కొండలా ఉన్న డంపింగ్ యార్డు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో దీర్ఘకాలంగా ఉన్న డంపింగ్ యార్డు సమస్య స్థానిక ప్రజలను వేధించింది. ముఖ్యంగా స్థానిక యడ్లబజారు సెంటర్, రామయ్యహాలు ప్రాంతాల్లో డంపింగ్ యార్డులు కొండల్లా పేరుకుపోయాయి. విలీన గ్రామాలు ప్రక్రియ మొదలైతే పట్టణంలో డంపింగ్ సమస్య మరింత జఠిలమయ్యే అవకాశం ఉంది. సమస్యను గ్రహించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టడంతో డంపింగ్ సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు. రీ సైక్లింగ్ చేసే ప్రాసెసింగ్ యూనిట్ అంతా ఒక చోట ఏర్పాటుచేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో సుమారు నాలుగెకరాలు భూమిని కొనుగోలు చేశారు. ఇందులో కొందరు రాజకీయ లబ్ధికోసం రాజకీయం చేస్తూ ఇక్కడ చెత్త కేంద్రం పెడితే అంతా వాసన వచ్చేస్తుందని కోర్టుకు వెళ్లి అక్కడ చెత్త రీ సైక్లింగ్ యూనిట్‌ను పెట్టకుండా నిలుపుదల చేశారు. పట్టణం 4.7 కి.మీటర్ల పరిధిలో 31 వార్డులు ఉన్నాయి. జనాభా సుమారు 70 వేల మంది ఉన్నారు. రోజుకు పట్టణంలో దాదాపుగా 40 టన్నుల చెత్త సేకరిస్తున్నారు.

వేస్ట్ రీ సైక్లింగ్‌తో సమస్య పరిష్కారం

పట్టణంలో యడ్లబజారు సెంటర్, రామయ్య హాలు ప్రాంతాల్లో రెండు డంపింగ్ యార్డులు ఉన్నాయి. యడ్లబజారులో ఉన్న డంపింగ్ యార్డులో సుమారు 30 వేల టన్నులు, రామయ్య హాలులో సుమారు 25 వేల టన్నులు చెత్త ఉంటుందని మునిసిపల్ అధికారులు అంచనాలు వేశారు. నాడు రీ సైక్లింగ్ ప్రాసెస్‌ను గుంటూరుకు చెందిన అవినాష్ ఏజెన్సీస్ సంస్థకు అప్పగించారు. యడ్లబజారు సెంటర్‌లో ఉన్న డంపింగ్ యార్డులో రీ సైక్లింగ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుచేశారు. రోజుకు సుమారు 300 నుండి 500 టన్నులు వరకూ రీ సైక్లింగ్ చేశారు. లెగసీ వేస్ట్‌ను రీసైక్లింగ్ చేయగా వచ్చిన ప్లాస్టిక్ (ఆర్‌డీఎఫ్), మట్టి (-10), బ్లాక్ సాయిల్ (-40) ల కింద మూడు విభాగాలుగా విభజించారు. ప్లాస్టిక్‌ను గుంటూరుకు చెందిన జిందాల్ సంస్థకు తరలించారు. (-10) మట్టిని ఎరువుగా వాడుకోవడానికి ఉపయోగించవచ్చని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అలాగే (-40) బ్లాక్ సాయిల్‌ను మునిసిపల్ రిజర్వ్ స్థలాల్లో ఫిల్లింగ్ చేశారు. ఈ ప్రక్రియతో పట్టణంలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారమైందని ప్రజలు భావించారు.

పనుల నిలుపుదల

ముందుగా 25 వేల మెట్రిక్ టన్నులు రీ-సైక్లింగ్ చేసే విధంగా అవినాష్ ఏజెన్సీ టెండర్ వేసింది. గత సంవత్సరం మార్చి నెలతో వారికి కేటాయించిన మెట్రిక్ టన్నుల చెత్తను రీ సైక్లింగ్ చేశారు. ఇంకా రామయ్యహాలులో ఉన్న డంపింగ్ యార్డు, యడ్లబజారులో ఉన్న కొద్దిపాటి చెత్తను రీ సైక్లింగ్ చేయాల్సి ఉంది. ఈ లోపు ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో టెండర్ రెన్యూవల్ కాకపోవడంతో ఆ ఏజెన్సీ వెనక్కి వెళ్లిపోయింది. ప్రస్తుతం మళ్లీ చెత్త కొండల్లా తయారవుతుంది.

డంపింగ్ యార్డు వల్ల ప్రమాదాలు

డంపింగ్ యార్డు వల్ల అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయి. డంపింగ్‌లో అన్ని రకాల వేస్ట్ మెటీరియల్స్ ఉంటాయి కాబట్టి వాటికవి అంటుకునే అవకాశం ఉంటుంది. లేదంటే ఎవరైనా ఆకతాయిలు అగ్గిపుల్లలు వంటివి వేసి అంటించే ప్రమాదం కూడా ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో రామయ్యహాలు డంపింగ్ యార్డు ప్రాంతంలో చుట్టూ ఇళ్లు ఉండడంతో ప్రజలు పొగతో ఆస్తమా, ఊపిరితిత్తుల వంటి అనారోగ్యాలకు గురవుతున్నారు. ముఖ్యంగా యడ్లబజారు సెంటర్ నుండి పెనుమదం వైపు వెళ్లే వాహనదారులు చీకట్లో పొగ కమ్మేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీటన్నింటినీ గ్రహించి అధికారులు డంపింగ్ యార్డు సమస్యను త్వరగా పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

త్వరలో సమస్యల పరిష్కారం



డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నాం. మూడు వారాలు క్రితం ప్రభుత్వం డ్రోన్ ద్వారా డంపింగ్ యార్డు ఎన్ని మెట్రిక్ టన్నులు ఉంటుందో అంచనాలు వేయించింది. సుమారు 33 వేల మెట్రిక్ టన్నులు చెత్త ఉన్నట్లు నిర్ధారించారు. త్వరలో అంచనాలు తయారు చేసి రీ సైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

– రాజు, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, పాలకొల్లు

నేడు నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

ఆస్తి పన్ను వడ్డీల్లో 50 శాతం రాయితీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో వినియోగదారులు కట్టే ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం వడ్డీ రాయితీ కల్పించిందని మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి తెలిపారు. మంగళవారం కమిషనర్ విజయసారధి విలేకరులతో మాట్లాడుతూ వినియోగదారులు చెల్లించే ఆస్తి పన్నుల్లో బకాయిలున్న ఆస్తి పన్నులకు వడ్డీ విధిస్తారని, ప్రభుత్వం ఆ వడ్డీలో 50 శాతం రాయితీ కల్పించిందన్నారు. ఈ అవకాశం మార్చి 31 వరకూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాడుతున్న 11 మంది అరెస్టు

పెనుగొండ: మండలంలో ఇలపర్రు గ్రామ శివారు పొలాల్లో పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై కె.గంగాధర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. నిందితుల దగ్గర నుంచి రూ.6400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని ఊటాడలో పేకాడుతున్నారనే సమాచారంపై మంగళవారం దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2830 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య చెప్పారు.

భీమవరంలో..

భీమవరం: భీమవరం పట్టణం జువ్వలపాలెం రోడ్డులోని ఓ లాడ్జిలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టుటౌన్ సీఐ జి కాళీచరణ్ చెప్పారు. మంగళవారం సాయంత్రం విసిప్స్టే లాడ్జిపై దాడిచేయగా పేకాడుతున్న వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 1,01,600 నగదు, ఆరు సెల్‌ఫోన్స్, రెండు మోటారు సైకిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కాళీచరణ్ చెప్పారు.

మున్సిపాలిటీలో విజిలెన్స్ తనిఖీలు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో విజలెన్స్ అధికారులు పలు ఫైళ్లను తనిఖీ చేశారు. విజలెన్స్ డీఈ శ్రీనివాసన్‌తో పాటుగా మరో ఇద్దరు అధికారులు తనఖీల్లో పాల్గొన్నారు. 2019-24 మధ్య కాలంలో మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఇంజనీరింగ్ సెక్షన్‌లో ఫైళ్లను పరిశీలించారు. అలాగే టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో వివిధ కట్టడాలకు ఇచ్చిన అనుమతులపై ఆరా తీశారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటిలో అభివృద్ధి పనుల్లో అవినీతి జరిందని కొందరు విజిలెన్స్ శాఖకు ఫిర్యాదు చేయడంతో ఈ తనిఖీలు చేసినట్టుగా తెలిసింది.

ముగిసిన హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో



హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్‌పోలో ఓ స్టాల్ వద్ద కొనుగోలుదారుల సందడి

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని రుస్తుంబాద గ్రామంలోని అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎల్‌టీసీ)లో ఈపీసీహెచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్‌పో మంగళవారంతో ముగిసింది. ఈపీసీహెచ్ సదరన్ రీజియన్ కోఆర్డినేటర్ కలవకొలను తులసి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ ఎక్స్‌పో చివరి రోజు కావడంతో సందర్శకుల తాకిడి ఎక్కువైంది. ఉభయ గోదావరి జిల్లాలు, పరిసర ప్రాంతాల నుంచి సందర్శకులు, కొనుగోలుదారులు పోటెత్తారు. చివరి రోజు సాయంత్రం వరకూ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయం, ప్రదర్శనలతో ఐఎల్‌టీసీ ప్రాంగణం అంతా పండుగ వాతావరణం నెలకొంది.

ముగిసిన జాతీయ సదస్సు

తణుకు అర్బన్: స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సదస్సులో ఆంధ్ర యూనివర్శిటీ ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీవీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ భారత దేశ ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ, చిన్నతరహా, మధ్య తరహా పరిశ్రమలు శక్తివంతంగా ఎదిగాయని, ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు.

గ్రామాల్లో ఉత్సాహంగా 'పొలం పిలుస్తోంది'



పెనుగొండ: ఇలపర్రులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి స్పందన



నరసాపురం రూరల్: ఎల్బీచర్లలో వరి చేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



యలమంచిలి: పెనుమర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

నరసాపురం రూరల్: వ్యవసాయ శాఖ ద్వారా అందజేసిన నూతన వరి వంగడాల వరి పంట చేలను ఏడీఏ ఈదా అనిలకుమారి రైతులతో కలసి పరిశీలించారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నరసాపురం మండలం ఎల్బీచర్ల గ్రామంలో గ్రామానికి చెందిన కటకంశెట్టి గోపాలరావు వ్యవసాయ క్షేత్రంలో మినికిట్ ఆర్ఎస్ఆర్ 15018, ఎంటీయూ 1426 రకాలు సాగు చేసి పంట చేలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ అనిల్‌కుమారి మాట్లాడుతూ మినీ కిట్ రకాలు మంచి దిగుబడులు ఇస్తున్నాయన్నారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నీటి సంఘం జిల్లా వైస్ చైర్మన్ గుబ్బల మార్రాజు, గుబ్బల వీరాస్వామి, కటకంశెట్టి మాణిక్యాలరావు, గురవయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూ సారం పెంపొందించుకోవాలి

పెనుగొండ: భూసారం పెంచుకోవడానికి రైతులు కృషి చేయాలని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి.స్పందన అన్నారు. మండలంలోని ఇలపర్రు, సిద్ధాంతంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కాలంలో రైతులు అధిక మోతాదులో రసాయనిక ఎరువుల వాడకం, రెండు పంటలు అనంతరం భూమిని బీడు పెట్టడం వల్ల భూమిలో సేంద్రియ కార్బన శాతం తగ్గుముఖం పట్టి నేలలు నిస్సారంగా మారుతున్నాయన్నారు. దీనిని అధిగమించడానికి ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ సాగు అలవర్చుకోవాలన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: రైతులు పండించిన ధాన్యాన్ని తమకు నచ్చిన మిల్లుకే తోలుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి చెప్పారు. పెనుమర్రు గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం దాళ్వా చేలన్నీ ఈనిక, పాలు చేసుకునే దశలో ఉన్నాయన్నారు. అయితే స్వల్పకాలిక రకాలయిన ఎంటీయూ- 1153, ఎంటీయూ-1156, పీఆర్-126 వంటి రకాలు త్వరగా కోతకు వస్తాయన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారానే మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సార్వా మాదిరిగానే దాళ్వా ధాన్యం కూడా రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకే ధాన్యం తరలించుకోవచ్చున్నారు. రైతు ఏ రోజు అయితే ట్రక్ షీట్ జనరేట్ చేయించుకుంటారో ఆ రోజే ఎఫ్‌టీఓ (నగదు బదలీ ఉత్తర్వులు) కూడా జనరేట్ అవుతాయన్నారు. అయితే రైతు వేలిముద్ర వేస్తేనే ఎఫ్‌టీఓ జనరేట్ అవుతుందని, రైతులంతా తప్పనిసరిగా వేలిముద్ర వేసి ఎఫ్‌టీఓ జనరేట్ చేయించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రైతులు పొత్తూరి సోమరాజు, తోటకూర రామకృష్ణంరాజు, మండపాటి రామభద్రరాజు, అశోక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

బీఐఎస్ మార్క్‌పై అవగాహన



విద్యార్థులు తయారు చేసిన బీఐఎస్ పోస్టర్లు

పాలకొల్లు సెంట్రల్: వినియోగదారులు ఏదైనా వస్తువు కొనేటప్పుడు బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) మార్కు ఉన్న వస్తువులనే కొనుగోలు చేయాలని బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.ప్రభాకరశాస్త్రి అన్నారు. మంగళవారం స్థానిక బీవీఆర్ఎం బాలికోన్నత పాఠశాలలో బీఐఎస్ మార్క్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరశాస్త్రి మాట్లాడుతూ బీఐఎస్ మార్కు వస్తువులకు సంబంధించిన నాణ్యతను తెలియజేస్తుందన్నారు. విద్యార్థులకు బీఐఎస్ పోస్టర్ తయారీ పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో బీఐఎస్ మెంటర్ సీహెచ్ శిరీష, ఉపాధ్యాయురాలు డి.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న అంజుమన్ పెద్దలు

నరసాపురం: తోటి వారికి సాయపడమని ఖురాన్ ప్రబోధిస్తుందని నరసాపురం అంజుమన్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ బులిమస్తాన్, ఎండీ దావూద్‌ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక అంజుమన్ భవన్‌లో రంజాన్ మాసం నేపథ్యంలో సంఘం ఆధ్వర్యంలో పేద ముస్లిం సోదరులకు దుస్తులు పంపిణీ చేశారు. 700 మందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో దుస్తులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పవిత్ర రంజాన్ మాసంలో మనకు ఉన్న దానిలో కొంతభాగం పొరుగువారికి ఇవ్వాలని, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలి ఖురాన్ ప్రబోధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అంజుమన్ సంఘ పెద్దలు ఎండీ మౌలాలీఖాన్, బషీర్‌ఖాన్, బడేవలీ, ఖాజా, అహ్మద్ ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక నిర్ధారణతో క్యాన్సర్ నివారణ



తూర్పుతాళ్లులో క్యాన్సర్‌పై అవగాహనను కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నరసాపురం రూరల్: క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించి, సరైన చికిత్స, మందులు వాడటం ద్వారా నివారించవచ్చునని డాక్టర్ ధనలక్ష్మి, ప్రోగ్రాం అధికారి గాతల సుభాస్ అన్నారు. మంగళవారం నరసాపురం మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో ఎన్‌సీడీ 3.0 జిల్లా కార్యక్రమంలో భాగంగా నాన్ కమ్యూనికల్ డిసీజెస్ బృందం పర్యటించింది. ఈ బృందం ఇంటింటి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటి స్క్రీనింగ్ కార్యక్రమంలో ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కాన్సర్‌లను, హైపర్‌టెన్షన్, డయాబెటిస్‌లను గుర్తించడానికి స్క్రీనింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో తూర్పుతాళ్ల వైద్యాధికారి ఆకుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో పంట కాలువలు



ఆలమూరు వద్ద కాలువ ఒడ్డున ప్లాస్టిక్ వ్యర్థాలు



గరువులోని పంట చేల వద్ద తగులబెట్టిన ప్లాస్టిక్ వ్యర్థాలు



నేలపోగుల కాలువలో పేరుకుపోయిన చెత్త

పెనుమంట్ర: తాగు, సాగునీటి అవసరాలను తీర్చే పంటకాలువలు నేడు డంపింగ్ యార్డులుగా మారాయి. ప్రధానంగా పెనుమంట్ర మండలం మీదుగా ప్రవహించే గోస్తనీ పంట కాలువ, రేలంగి ఛానల్, రాపాక ఛానల్, నరసాపురం పంట కాలువల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గృహాలు, షాపులలోని ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువలలో పడవేయడంతో మురికికూపంగా మారుతున్నాయి. బ్రాంచ్ కెనాల్స్‌లో ఎక్కడ చూసినా జంతు మృత కళేబరాలు, ప్లాస్టిక్ సంచుల మూటలతో దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి కాలువల స్లూయిజ్‌ల వద్ద చనిపోయిన కోళ్ల మూటలు పేరుకుపోవడంతో ఈగలు, పురుగులు పట్టి తాగునీరు కలుషితం అవుతోంది. కోళ్లు, జంతు కళేభరాలతో నిండిపోవడంతో మురుగుడ్రెయిన్ కంటే దారుణంగా మారాయి. కనీసం కాలువ నీటిలో స్నానం చేయడానికి కూడా రైతులు సాహసించడంలేదంటే కాలువనీరు ఏ మేరకు కలుషితం అవుతుందో అర్థమౌతుంది. పగలు ఈగలు మోత, రాత్రి దోమల మోతతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు.

ఇదీ పరిస్థితి

పెనుమంట్ర మండలంలో 13 వేల ఎకరాలలో వరి సాగు చేస్తుంటారు. 18 గ్రామాల ప్రజలకు తాగు నీటి అవసరాలను ప్రధాన కాలువలు తీరుస్తుంటాయి. ఈ కాలువ నీటినే గ్రామ పంచాయతీ చెరువుల్లో నింపి ఫిల్టర్ చేసి ప్రజలకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తుంటారు. గ్రామాలలో అధిక శాతం మంది పంచాయతీ సరఫరా చేసే కుళాయి నీటినే తాగునీటి అవసరాలకు వినియోగిస్తుంటారు. ఈ కలుషిత నీటిని తాగితే అనేక జబ్బులు బారిన పడే ప్రమాదం ఉంది. తణుకు పట్టణం, వేల్పూరు గ్రామాల్లోని చెత్త, డ్రెయిన్‌లు, గోస్తనీ పంట కాలువలోకి , పెరవలి నుంచి మార్టేరు వరకు కాలువ వెంబడి ఉన్న గృహాలు, షాపుల్లో చెత్త అంతా కాలువలలోకి వదిలేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు ఏమీ పట్టనట్లు ఉండడడంతో కొందరు కాలువ గట్లను ఆక్రమించి పక్కా గృహాలను నిర్మించుకున్నారు. ఇటీవల ఏర్పడిన నీటి సంఘాల నాయకులు కూడా పట్టించుకోక పోవడంతో కాలువలు, బ్రాంచ్ కాలువలు కూడా చెత్తతో పూడుకుపోవడంతో సాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల వైన్స్ షాపుల నుంచి వస్తున్న ప్లాస్టిక్ చెత్తతో పాటు గాజు సీసాలను కూడా కాలువల్లోనే వేస్తున్నారు. పంటకాలువలు కలుషితం కావడంతో రైతులు, కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పంట కాలువల్లో చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుని రైతులు ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కౌలు రైతులను గుర్తించాలి



ఉండిలో వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

ఉండి: కౌలు రైతును కూడా సాధారణ రైతులుగా మాదిరి గుర్తించి వారికి కౌలురైతు కార్డులు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం నుంచి రైతులకు లభించే ప్రతి పథకం వారికి అందించాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉండి వీరభద్రం, బద్దా రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉండిలో నిర్వహించిన కార్యక్రమంలో కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలంటూ మండల వ్యవసాయ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కౌలు రైతుకు తగిన గుర్తింపు లభించడం లేదని అన్నారు.వారికి వెంటనే గుర్తింపుకార్డులు మంజూరు చేసి బ్యాంకుల ద్వారా హామీ లేని రుణాలను అందించాలని అన్నారు. అలాగే బీమా, సబ్సిడీలను కూడా అందించాలన్నారు. ఉచిత పంట భీమా సౌకర్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్రి సూరిబాబు, కోనా గొల్లయ్య, కలిశెట్టి వెంకట్రావు, వైవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై బైండోవర్



భీమవరంలోని సెంట్రల్ క్రైమ్ పోలీసు స్టేషన్ వద్ద రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రెండు రౌడీషీటర్స్ గ్రూపులకు మంగళవారం టుటౌన్ సీఐ జి కాళీచరణ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వారిని బైండోవర్ చేసినట్లు సీఐ కాళీచరణ్ చెప్పారు.